## పలు గ్రామాల్లో తెదేపా ప్రచారం

విశాలాంధ్ర - సంతబొమ్మాలి : ఈ మండలం హనుమంత్ నాయుడుపేట, పోతు నాయుడుపేట పంచాయతీలలో సంత బొమ్మాలి మండలం తెలుగుదేశం ముఖ్య నాయకులు ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యేగా అభ్యర్థిగా కింజరాపు అచ్చంనాయుడు, ఎంపీ అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్ నాయుడు లు పోటీ చేస్తున్నం దున సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సంత బొమ్మాలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీరు భీమారావు, ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న లు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలో కల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐటిడిపి నాయకులు పాల్గొన్నారు.

# దళితులను నట్టేటా ముంచిన వైసీపీ : సమతా సైనిక్ దళ్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : దళితులను నట్టేట ముంచిన ప్రభుత్వం వైసిపి అని, మాట తప్పను, మడమ తిప్పను, నేను విన్నాను, నేను ఉన్నాను అని గొప్పలు చెబుతూ ఓటు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేశారని, సమతా సైనిక్ దళ్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం స్థానిక అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు అంటూ సీఎం పదవి చేపట్టి కళ్ళు మూసుకొని పరిపాలించిన జగన్ కు తగిన బుద్ధి చెప్పి గద్దె దించాల్సిన అవసరముందన్నారు. విలువలతో కూడిన రాజకీయాలను చేస్తామని పదవి చేపట్టిన తర్వాత చెప్పేదొకటి, చేసేదొకటి అన్నట్లుగా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. గత ఐదు సంవత్సరాలుగా టిడ్కో ఇళ్ల పంపిణీ ఆగిపోయిందని, పేదలకు అన్నం పెట్టె, అన్నా కాంటీన్ కూల్చివేశారని, నా మేనమామలు అంటూ ఎస్.సి లకు జగన్ చేసిన మోసం అంతా ఇంతా కాదని, విద్యకు, ఉపాధికి, సామాజిక భద్రతకు, మొత్తం ఇరవై ఏడు పథకాలను నిర్లక్ష్యం చెయ్యడం సరికాదన్నారు. నా ఎస్ సీ లు, నా బిసిలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ దగా చేశారని, వారిపై సాగించిన దహమకాండను ఎవరూ మర్చిపోరన్నారు. రాష్ట్రానికి అంధకారం జగన్ వల్లేనని, పైకి సామాజిక సాధికారిత, లోలోపల కుల ఉన్మాదమని, మొత్తం పదవులు కులానికే అంకితం చేసుకున్నారంటే జగన్ వైఖరి అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి, మనమంతా ఏకమై జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వై. సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్ష్యులు పీఎం జె బాబు, జిల్లా ఉపాధ్యక్ష్యులు వి. లక్ష్మి నారాయణ, కాలేయవర్గ సభ్యులు ఎస్. ప్రసన్న కుమార్, ఎం. ప్రేమ్ కుమార్, టి. శంకర్ రావు, బి. సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యం వైసీపీ పాలనలో సాధ్యమైంది : వైసీపీ అభ్యర్థి డాక్టర్ సీధిరి అప్పలరాజు

విశాలాంధ్ర - పలాస : మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వైసిపి పాలనలోనే సాధ్యమైందని పలాస వైసిపి అభ్యర్థి డాక్టర్ సీధిరి అప్పలరాజు అన్నారు.సోమవారం మండలం లొత్తూరు, రెంటికోట, అలుక్లోల పంచాయితీలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాలలో వాలంటీర్ , సచివాలయ వ్యవస్థలను తీసుకువచ్చి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామ స్వరాజాన్ని సాపించారని అన్నారు. వాలెంటర్ ల ద్వారా నేరుగా ఇంటికే పించన్లు పంపిణీ చేశారని, తాహసిల్దార్ కార్యాలయాలకు వెళ్లకుండా వారి గ్రామంలోని సచివాలయాలలో పలు పౌరసేవలు అందించడం జరిగిందని అన్నారు. రైతులు కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు అందించారన్నారు. గత ఐదేళ్లలో లొత్తూరు, రెంటికోట, అలుకోల గ్రామాలలో పలు అభివృద్ధి పనులతో పాటు రహదార్లు, కాలువలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించామన్నారు. అంతే కాకుండా పుట్టిన పసిబిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతీ ఒక్కరికి జగన్ వివిద సంక్షేమ పథకాలు అందించి వారికి ఆర్థికంగా ఆదుకోవడం జరిగిందని గ్రహించాలన్నారు. 60 ఏళ్ల పాలనలో అభివృద్ధి ఐదేళ్ల జగనన్న పాలనలో తాను చేసిన అభివృద్ధిని పరిశీలించి ఎమ్మెల్యేగా తనకు. ఎంపిగా పేడాడ తిలక్ కు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉంగ ప్రవీణ వైస్ ఎంపిపిలు తలగాన శ్రీరాములు, సవర దాలమ్మ, సవర శ్రీమాన్, దువ్వాడ వామాక్షి, శాసనపురి తిరుమలరావు, జెసిఎస్ కన్వీనర్ దువ్వాడ రవి, పిఎసిఎస్ అధ్యక్షులు పైల చిట్టి,, ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, హనుమంతు వెంకట్రావు, గొర్లె వేణు, చింతాడ మాధవరావు, ఖగేశ్వరరావు దొర, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ రాజ్యం టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర - ఆమదాలవలస : ప్రజా సంక్షేమ రాజ్యం ఎన్డీఏ ఆధ్వర్యం లోని ఉమ్మడి తెలుగుదేశం పార్టీకే సాధ్య మని మండల పార్టీ నాయకులు తమ్మి నేని చంద్రశేఖర్, నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావులు అన్నారు. సోమవారం కనుగుల వలస పంచాయతీ పరిధి కొండ పేట, సీపాన చంద్రయ్య పేట గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా ప్రచా రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ సూపర్ సిక్స్ అమలతోనే అభివృద్ధి, సంక్షేమం చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వందాన ఉదయకుమార్, గొండు రవి, ఎండ అప్ప లనాయుడు, సనపల చల్లమనాయుడు, భాస్కర్ రావు, పాతిన రమణ, జోతీశ్వ రరావు అమర్నాథ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

## ఉత్సాహంగా కూటమి ప్రచారం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : రాష్ట్రంలో పరిపాలన కుంటుపడి ప్రజలు అవస్థలు పడు తున్నారని, అధికార పక్షాన్ని గద్దె దింపితేనే రాష్ట్ర భవిష్యత్ మెరుగవుతుందని తెలుగుదేశం- బిజెపి- జనసేన కూటమి శ్రేణులు మున్సిపాలిటీ పరిధి 21వ వార్డులో ప్రచారాన్ని చేసాయి. సోమవారం ఆ వార్డు కౌన్సిలర్ కాళ్ళ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. చిరుజల్లుల వానలో తడిసి మరీ బి.జె.పి, జనసేనల నియోజక వర్గ ఇన్‌ఛార్జ్‌లు బుద్ధాల నిర్మల, దాసరి, రాజులతో కూడిన కూటమి శ్రేణులు ఇంటింటికి వెళ్ళి పథకాల లబ్ధిని, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను పట్టణ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ళ ధర్మారావు, నందిక జానకిరావుల ఆధ్వర్యంలో వివరించారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్య క్షుడు కాళ్ళ జయదేవ్‌తో పాటు ఐ-టిడిపి బృంధం వై.సి.పి మోసాలను తిప్పికొట్టండని కోరారు.

## రాష్టం అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా గెలిపించాలి

### ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల

విశాలాంధ్ర - కవిటి : రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే నారా చంద్రబాబు నాయుడు ను ముఖ్య మంత్రిగా గెలిపించు కోవాలని ఎమ్మెల్యే అశోక్ సతీమణి నీలోత్పల అన్నారు. ఈ మేరకు సోమవారం మండ లంలో గల లండారిపుట్టుగ పంచాయతీ పరిధి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు జరుగుతుందని, పేదలకు సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడు కే సాధ్యమని అన్నారు. తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి ఎమ్మెల్యేగా అశోక్ ను,ఎంపీగా రామ్మోహన్ నాయుడు ను ఎన్నుకోవాలని అభ్యర్థించారు.గత టిడిపి హయాంలో అనేక అభివృద్ధి కార్య క్రమాలు చేపట్టిన ఘనత అశోక్ కే సాధ్యమని అన్నారు. నిరంతరం ప్రజల కోసమే పరితపించిన వ్యక్తి అశోక్ అని అన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి తెలుగుదేశానికి ఓటు వేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో మండల తెలుగు దేశం పార్టీ నాయకులు, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జెలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కింతలిలో ఇండిపెండెంట్ అభ్యర్థి ఇంటింటా ప్రచారం

విశాలాంధ్ర - పొందూరు : ఆమదాలవలస నియోజక వర్గ ఇండిపెండెంట్ అభ్యర్థి సువారి గాంధీ సోమవారం కింతలి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయ నకు గ్రామంలో అపూర్వమైన ఆదరణ లభించింది. ఇంటింటా ప్రచారంలో భాగంగా గాంధీ నుదుటిపై తిలకం దిద్ది మంగళ హారతులతో స్వాగతం పలికారు.పురవీధుల్లో అవ్వ తాతల ఆశీర్వాదాన్ని తీసుకొని మీ పవిత్రమైన ఓటును గ్యాస్ స్టవ్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏళ్ల తరబడిమామ అల్లుళ్ళ డాక్యుమెంటు రాజకీయాల ముసుగులో రాజ్యమేలుతున్నారని, ఒక్కసారి తమకు అవకాశం ఇవ్వండిని గాంధీ ప్రజలతో ప్రాధేయపడ్డారు. తనకు అవకాశం ఇస్తేనియోజవర్గ అభివృద్ధిని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, గజాల సూర్యారావు, కోరుకొండ సాయికుమార్, గంగిరెడ్ల శివకుమార్లతోపాటు పలువురు గాంధీ అభిమానులు సర్పంచులు ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## నీ భవిష్యత్తుకు నాది హామీ

- విద్యార్థి రామ్ చరణ్ కు రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేత
- ఉన్నత విద్యకు అండగా ఉంటానని తెలిపిన ప్రముఖ గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్

విశాలాంధ్ర - అరసవల్లి : శ్రీకాకుళం నగరానికి చెందిన రామ్ చరణ్ అనే విద్యార్థి భవిష్యత్తుకు నాది హామీ అని ప్రముఖ గైనిక్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. శ్రీకాకుళం సింహద్వారం సమీ పంలోని మెడికవర్ ఆసుపత్రిలో రామ్ చరణ్ తల్లితండ్రుల సమక్షంలో డాక్టర్ దానేటి శ్రీధర్ 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అంద జేశారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పేదరికంలో పుట్టడం తప్పు కాదని పేదరికంలోనే ఉండిపోవడం తప్పు అని చెప్పారు. సమా జంలో ఆర్థిక స్థితిగతులను, జీవన ప్రమాణాలను మార్చేది చదువు ఒక్కటేనని తెలిపారు. పట్టుదలతో చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకా ంక్షించారు. చదువు వల్ల సమాజంలో కీర్తి, గౌరవం లభిస్తుందని చెప్పారు. చదువుకునే దశలోచదువుకునే రోజుల్లోనే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానికోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. రామ్ చరణ్ ఉన్నత చదువుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో రాంచరణ్ తల్లిదండ్రులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కూటమి విజయానికి సహకరించండి

### న్యాయవాదులను కలసిన కూటమి అభ్యర్థులు

విశాలాంధ్ర - అరసవల్లి : కూటమి లక్ష్యాన్ని, రాష్ట్ర భవిషత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి విజయానికి విజ్ఞత కలిగిన న్యాయ వాదులు సహకరించాలని కూటమి ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్ విజ్ఞప్తి చేసారు. సోమవారం జిల్లా కోర్ట్ ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ హాల్ లో న్యాయవాదులను వారు కలిసారు. టీడీపీ, జనసేన. బీజేపీ కూటమి ఏర్పాటు వెనుకనున్న లక్ష్యాన్ని వివరించారు. కూటమి అభ్యర్థుల విజయానికి తద్వారా జిల్లా, నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గా గొండు శంకర్లను అత్యధిక మెజారిటీతో గెలిపించి మార్పునకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ. జనసేన. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## పేదల ప్రభుత్వానికి అండగా నిలవండి

### జెడ్పీటిసి డా.ధర్మాన కృష్ణచైతన్య

విశాలాంధ్ర - నరసన్నపేట : రాష్ట్రంలో పేదల ప్రభుత్వమైన వైసిపికి ప్రజ లందరూ అండగా నిల వాలని పోలాకి, జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం ఆయన దాసన్న ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలో కామేశ్వరిపేట, కొల్లవానిపేట, చోడవరం, గెడ్డవానిపేట, కొబగాం, కొత్తపోలవలస గ్రామాల్లో పాల్గొన్నారు. ఈ సంధ ర్భంగా ఆయన ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ సంక్షేమ పథకాలు రూపకర్త అయిన జగన్మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోలో పేదలకు సంక్షేమ పథకాల డబ్బులను గతం కన్నా పెంచారని, జగన్మోహన్‌రెడ్డిని గెలిపించు కుంటేనే పథకాలు సక్రమంగా అమలు అవుతాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ధర్మాన కృష్ణదాస్‌ను, శ్రీకాకుళం ఎంపిగా పోటీలో వున్న పేరాడ తిలక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, చింతు రామారావు, సురంగి నర్సింగరావు, లుకలాపు రవికుమార్, బొబ్బాది ఈశ్వరరావు, బగ్గు రమణయ్య, రాజాపు అప్పన్న పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి వైసీపీతోనే సాధ్యం : రెడ్డి శాంతి

విశాలాంధ్ర - హిరమండలం : రాష్ట్ర అభివృద్ధి వైసీపీ తోనే సాధ్య మని పాతపట్నం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి అన్నారు, సోమవారం మం డలం లోని గులు మూరు, కొండ రాగోలు, నౌగూడ కు చెందిన ఉపాధి వేతనదారులు ను వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి వైసీపీ కార్యకర్తలు తో కలిశారు, ఈసందర్భంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి ఈ 5 ఏళ్ళ పాలన లో పేద ప్రజలు కు ఎంతో లబ్ది చేకుర్చారని ఇలాంటి సీఎం ను మళ్ళీ గెలిపించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొనియాడారు,, పాతపట్నం నియోజకవర్గం లో మళ్ళీ వైసీపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్నాను, అలాగే శ్రీకాకుళం వైసీపీ ఎంపీ అభ్యర్థి గా పేరాడ తిలక్ పోటీ చేయు చున్నారు మా ఇద్దరు కు ఫ్యాన్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించండి మీ ఋణం తీర్చు కుంటాము అని రెడ్డి శాంతి అన్నారు.. ఈమె వెంట వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల అబ్జర్వర్ అందుబాటులో ఉంటారు

విశాలాంధ్ర - రణస్థలం : తలాత్ పర్వేజ్ ఇక్బాల్, (ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ జనరల్ అబ్సర్వర్) ప్రతీ మంగళవారం ప్రజలకు/ఓటర్లకు అందుబాటులో ఉంటారు. ఎన్నికలకు సంబంధించిన సమా చారం లేదా ఎన్నికల ప్రవర్తనా నియమావళి మీద ఏవైనా ఫిర్యాదులు ఉన్నచో తెలియపర చవచ్చని పత్రికా ప్రకటన ద్వారా ఆర్వో లక్ష్మణ మూర్తి ఫోన్ నెంబర్: 9032338136 (ఎలక్షన్‌అబ్జర్వర్‌వీజెడ్‌ఎంఎట్‌జీమెయిల్.కాం)

## ఉమ్మడి కూటమి అభ్యర్థి గెలుపునకు కృషి : అగ్నికుల క్షత్రియ నాయకులు

విశాలాంధ్ర - పలాస : టీడిపి బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష గెలుపుకు కృషి చేస్తామని అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు అన్నారు. సోమవారం పలాస నియోజకవర్గం పరిధి అగ్నికుల క్షత్రియ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడ్డామని, ప్రతి వ్యాపారస్తుడుకి ఆర్థికంగా ఇబ్బంది పెట్టారని, మరి కొందరు నాయకులు కార్యకర్తలను వేదిస్తూ అక్రమ కేసుల్లో ఇరికించి భయ్ర బ్రాంతులకు గురి చేశారని అన్నారు. శిరీషను గెలిపించుకోవలసిన అవశ్యకత చాలా అవసరమని అందు కోసం అందరం కష్టపడి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ టిడిపి జనసేన బిజెపి కూటమి తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ఎన్డీఏ కూటమి అభ్య ర్థులను గెలిపించుకోవాలని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తల పై దాడులు చేయడం, కేసులు పెట్టారే తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. రాష్ట్ర ప్రజల కోసం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన పవన్ కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారని, వారికి అండగా నిలిచి టిడిపి, జనసేన, బిజేపి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు ప్రకృతి వనరులను దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు అంతా ఒకే తాటి పైకి వచ్చి కలిసికట్టుగా పని చేస్తే మనదే విజయం తథ్యమన్నారు. గ్రామాల్లో ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైసీపీ నాయకులు చేసిన అరాచకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళి ఓటు మాత్రం సైకిల్ గుర్తు పై ఓటు వేసే విధంగా చూడాలన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా, ఎంపీ రాంమోహన్ నాయుడును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ససేవ్ పలాస సేఫ్ పలాస, ప్రతి చేతికి పని... ప్రతి చేనుకు నీరు , జీడి రైతులకు గిట్టుబాటు ధర, జీడి కార్మికులకు ఈ .యస్. ఐ. ఆసుపత్రి , జీడి వ్యాపారస్తులకు కాష్యు బోర్డు ఏర్పాటు, డిఫెన్స్ అకాడమీ, సీమెన్స్ ప్రభుత్వ నైపుణ్య శిక్షణ కేంద్రం, జీడీ, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి మహిళలకు ఆదాయవనరులుగా ఏర్పాటు చేయడం నా సంకల్పం అని తెలిపారు. మాజీ ఎంపీపీ వసంత స్వామి, పుచ్చ ఈశ్వరరావు, సాంబమూర్తి, మోహనరావు బత్తిన, కుత్తుం లోకానాథం, రెయ్యి నాగార్జున, గర్తం తులసీరావు,తిమ్మల విజయ్ కుమార్, బత్తిని క్రిష్ణ, యలమంచి భాస్కర్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ పరిశీలించిన వ్యయ పరిశీలకులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు నియమితులైన వ్యయ పరిశీలకులు, నవీన్ కుమార్ సోనీ సోమవారం కలెక్టరేట్ లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ (ఎన్నికల నియంత్రణ కేంద్రం) ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ఇంచార్జి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్ని విభాగాలను పరిచయం చేశారు. ఎంసీఎంసి, ఎలెక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ సెల్, ఎస్పెండెచర్ మానిటరింగ్ సెల్, సీజర్స్, సువిధ, గ్రీవిన్స్ రిడ్రెసల్ సెల్ మొదలైన విభాగాల సిబ్బంది నిర్వర్తిస్తున్న విధులను గురించి పరిశీలకులకు వివరించారు. కంట్రోల్ రూమ్ తోపాటు జిల్లా సీజర్స్ స్క్రీనింగ్ కమిటీ ద్వారా కూడా పట్టుబడిన నగదు, అర్నమెంట్స్ కు సంబందించిన ఆధారాలు సమర్పించి విచారణ, నిజ నిర్ధారణ అనంతరం అప్పగించడం జరుగుతోందన్నారు. అన్ని విభాగాల సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై పరిశీలకులు ఆరా తీశారు. మీడియాలో ఎన్నికల ఏర్పాట్లపై, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును ఆరా తీశారు. ఆయా విభాగాలు నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు. కంట్రోల్ రూమ్ లో సీసీ కెమెరాల ద్వారా జరుగుతున్న పర్యవేక్షణ, ఎఫ్ ఎస్ టి టీములకు అమర్చిన జీపీఎస్ విధానాన్ని ఆసక్తిగా చూసి, ప్రశ్నలు అడిగారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీంలు, ఫ్లైయింగ్ సర్వేలెన్స్ టీంలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జి.పి.ఎస్ విధానం ద్వారా ఆయా వాహనాలు ఎక్కడ ఉన్నది, ఆయా నిఘా బృందాల కదలికలను పర్యవేక్షించే తీరును తెలుసుకున్నారు. అనంతరం ఎన్నికల కమిషన్ కు రోజూవారీ నివేదికలు పంపే విధానాన్ని పరిశీలించారు. షాపులకు మద్యం సరఫరా విధానాన్ని, దాన్ని పర్యవేక్షించే వ్యవస్థను పరిశీలించారు. సంబంధిత ఎన్నికల నోడల్ అధికారులు డిఆర్డిఏ పిడి కిరణ్ కుమార్, సి.పి.ఓ లక్ష్మి ప్రసన్న, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, ఆడిట్ అధికారి సుల్తానా, సెట్రశ్రీ సిఇఓ వెంకటేశ్వర రావు, హౌసింగ్ పీడీ గణపతిరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కే చెన్నకేశవరావు తదితర అధికారులు ఆయా విభాగాల పనితీరు విధానాన్ని వివరించారు.

## సంక్షేమ యుగానికి నాంది పలికిన అద్భుత నేత సీఎం జగన్

### ఏపీ స్పీకర్ స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర - ఆమదాలవలస : రాజకీయాలలో కొత్త ఒరవడిని తీసుకొ చ్చిన ఘనత వైసీపీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆంధ్రప్రదేశ్ శాసన సభాప తి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. పార్టీ అధినేత అందరూ నడిచే బాటలో కాకుండా అభి వృద్ధి సంక్షేమం అనే దిక్సూచి బాటలోనే అడుగులు వేస్తున్నారని అన్నారు. సోమ వారం ఆముదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు తిమ్మాపురం జగ్గు శాస్త్రిల పేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో స్కూల్స్ రూపు రేఖలు మార్చేలా నాడు - నేడు కార్యక్రమం లో భాగంగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనులు చేశారన్నా రు. గ్రామాల్లో ప్రాథమిక చికిత్సలు అందించే ఉద్దేశంతో ఆరోగ్య కేంద్రాలు ప్రభుత్వం నెలకొల్పేలా చర్యలు చేప ట్టిందన్నారు. గ్రామాల్లో అన్ని పౌర సేవ లు ఒకే చోట దక్కేలా అధికార వికేంద్రీక రణ ద్వారా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ప్రతి గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా త్రాగు నీటి కల్పనకు చర్యలు తీసుకు న్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు మీద ఓటు వేసి వైసీపీకి పట్టం కడితే ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమం లో బొడ్డేపల్లి రమేష్ కుమార్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు బోడ్డేపల్లి అజంతా కుమారి దుంపల శ్యామలరావు దుంపల చిరంజీవి పొడుకు శ్రీను విజయ్ బిట్టు, పొదిలాపు తిరుపతి రావు స్థానిక నాయ కులు సంపద రావు రామారావు మెట్ట చక్రదరరావు కిల్లి అప్పల నాయుడు తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొందూరు పుడమిపై పోటెత్తిన పచ్చదండు ప్రచారం

విశాలాంధ్ర - పొందూరు : ఆమదాలవలస నియోజకవర్గ బిజెపి, జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా కూన రవికుమార్ గెలుపు కోసం దేశం పచ్చ దండు తమ్ముళ్లు మండల కేంద్రం పొందూరు పుడమిపై పోటెత్తిన జనం కదలివచ్చి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కూన గెలుపు అభివృద్ధికి మలుపు, నరరూప రక్షక పాలనను సమాధి చేద్దాం- సమాధి చేద్దామంటూ పురవీధుల్లో హోరెత్తిన నినాదం ఒక వైపు చేస్తుంటే, మరోవైపుకూన రవికుమార్ సతీమణి మాజీ ఎంపీపీ ప్రమీలతో కూడిన మహిళా బృందం వీధుల్లో దూసుకుపోతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలు ప్రమీలమ్మకు చిరునవ్వులతో స్వాగతం పలికిమంగళ హారతులతో స్వాగతం పలికారు.నుదుట తిలకం దుద్ది ఇంటింటా దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి శ్రీరంగనాయకులు (చిన్న రంగా), స్థానిక ఎంపీటీసీలుఅనకాపల్లి వాణి, బాడాల హారిక, జిల్లా తెలుగు యువత సంయుక్త కార్యదర్శిబలగ శంకర భాస్కరరావు,మండల పార్టీ ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి నాయుడు,మాజీ ఎంపీటీసీ దండా రవికుమార్, కాలెపు శ్రీనివాసరావు, మాజీ విప్ కాలేపు అశిరినాయుడు, మండల టిఎన్టియుసి అధ్యక్షులు మొకర సత్యనారాయణ, మాజీ టిడిపి టౌన్ అధ్యక్షులుమద్దిల శ్రీనివాసరావు, ఆమదాలవలస నియోజకవర్గ దేశం నేతసిపాన శ్రీ రంగనాయకులు,మండల యువజన నేతలుఅనకాపల్లి రమేష్, అనకాపల్లి కృష్ణ, టిడిపిమాజీ జిల్లా కార్యవర్గ సభ్యులు అనకాపల్లి గోపీనాథ్, రైతు నేతలు అనకాపల్లి అప్పలస్వామి, కొండల రాజారావు లతోపాటు సర్పంచులు ఎంపీటీసీలు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిఎసిఎస్ మా జీ అధ్యక్షులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## టీడీపీలో పలువురు చేరిక

విశాలాంధ్ర - మందస : మండలంలో బుడారిసింగి పంచాయతీ మరదమేక గ్రామానికి చెందిన 20 కుటుంబాలు, బేతాళపురం పంచా యతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు నాయకులు, చిన్నలోహరిబంద గ్రామానికి చెందిన 40 మంది టీడీపీలో చేరారు. వీరికి పలాస టీడీపీ అభ్యర్థి శిరీషా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించింది. కార్యక్రమంలో భావన దుర్యోదన, కొర్ల కన్నారావు, లబ్బ రుద్రయ్య, లింగరాజు, డొంకూరు తిరుపలి, నవీన్ యాదవ్, కారి ఈశ్వరరావు, చీకటి క్రిష్ణారావు, సంగారు తులసీదాసులు పాల్గొన్నారు.

## కూటమితోనే అభివృద్ధి సాధ్యం : మాజీ ఎంపీపీ సలాన

విశాలాంధ్ర - మెళియాపుట్టి : ఎన్డీఏ కూటమితోనే ప్రతి మారుమూల పల్లె సైతం అభివృద్ధికి సాధ్యమ వుతుందని, కుటమి అభ్యర్థులైన స్థానిక పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు, శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సలాన మోహనరావు, మాజీ మండల ఉపాధ్యక్షులు భైరిసింగి దినకర్లు కోరుతున్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి సంబంధించి మెళియాపుట్టి మండలంలో గల పద్ద, గోడ్డ, ఎగువరింపి, పెంగువాడ, దిగువ అనంతగిరి తదితర గిరిజన గ్రామాలలో సోమవారం నాడు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాలలో నున్న యువత, ప్రజలతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని తెలియజేస్తూనే, గ్రామాలభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వారితో పాటుగా మాజీ సర్పంచ్ విశ్వనాథ బిసాయి, ఆర్‌ఎంపి పి. జనార్ధనరావు, జి. వీరయ్య, పోలయ్య, బి. భాస్కరరావు, జి. ప్రసాద్, జి. జోగారావు, చిన్నబాబు, హరికృష్ణ మజ్జి, బిరోసేన, బలరాం, గణపతి, ఈశ్వరరావు, ఎస్. సీతయ్య, సిహెచ్. లక్ష్మీనారాయణ, పోతయ్యలతో పాటు ఆయా గ్రామాలలో ఉన్న గిరిజనులు, యువకులు, మహిళలు, ప్రజలు తదితరులున్నారు.

## ఎన్నికల విధులకు ఎన్‌సీసీ కాడెట్లు : కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లను ఎన్నికల విధులకు వినియోగించు కునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ ఆదేశించారు. వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరిగే ఒక్కరోజు సామాజిక సేవ, స్వచ్ఛంద ప్రాతిపదికన వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక తో కలిసి కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సోమవారం ఉదయం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2358 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఒక్కో కేంద్రానికి ఒక్కొక్కరు చొప్పున 18 ఏళ్లు నిండిన ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ క్యాడేట్లను వినియోగిస్తామని, ఇందుకు గాను వారి తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రాలు తీసుకోవాలని చెప్పారు. వీరికి శాంతిభద్రతలకు సంబంధించి ఎలాంటి పనులు అప్పగించబోమని, ఓటరు సహాయం కోసం మాత్రమే వీరి సేవలను వినియోగిస్తామని స్పష్టం చేస్తారు. జిల్లా ఎస్పీ రాధిక మాట్లాడుతూ ఎన్‌సిసికి చెందిన కాడెట్లు 852 మంది అందుబాటులో ఉన్నారని, అలాగే ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు 1774 ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే వీరికి భోజన, వసతి, రవాణా సదుపాయం కల్పిస్తామని అన్నారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ఏ.త్రినాధరావు, ఎన్‌సిసి ఏఎన్‌ఓ వై పోలి నాయుడు, 14వ ఎన్‌సిసి బెటాలియన్ తరపున షేక్ కమాల్, జితేంద్ర కుమార్, పోలీసుల తరపున జి.నిర్మల, సిహెచ్ సూరి నాయుడు, సెట్ శ్రీ సీఈవో ప్రసాద రావు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌ను గెలిపించండి : అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు

**విశాలాంధ్ర - పలాస :** రాష్ట్రంలో టిడిపి, వైసిపి పాలన ప్రజలు చూశారని ఒకసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని పలాస నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మజ్జి త్రినాథ్ బాబు అన్నారు.సోమవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 28వ వార్డు ఉదయపురం గొల్ల వీధి,హరిజన వీధి, రాజమ్మ కాలనీ,సాయిరాం వీధి గోడగల వీధులలో ర్యాలీ నిర్వహించి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి మజ్జి త్రినాథ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి ఎంతో సేవ చేసిందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడితే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా వస్తుందన్నారు. మే 13 జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్ల హేమా రావు చౌదరి,బద్రి సీతమ్మ యాదవ్, శ్రీరంగం సురేష్, రాపాక రుద్రయ్య యాదవ్, ఉప్పాడ రాజారావు మాస్టర్, పోలాకి అప్పారావులు పాల్గొన్నారు.

## పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే జగన్మోహన్ రెడ్డి సీఎం కావాలి

### ఇచ్ఛాపురం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ

**విశాలాంధ్ర - కవిటి :** పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి చేయడం ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందని, వారి జీవితాల్లో వెలుగులు వుంటాయని ఇచ్ఛాపురం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ. అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలో గల జమేదారిపుట్టుగ, కరాపాడు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాలలో ఆమె ఇంటింటికీ వెళ్లారు. ఫ్యాను గుర్తు కు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి అయినా తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల పద్మ ప్రకాష్, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణా రౌలో, ఏఎంసి చైర్మన్ ఎస్ బాబు రావు, ఏఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, పూడి నీలాచలం, పిరియా కృష్ణారావు, మురపాల లచ్చయ్య, నల్లన శ్రీను, వైసిపి నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 'హడ్కో' కాలనీలో టీడీపీలో చేరిన 'గూర్జ రమణ' కుటుంబం

**విశాలాంధ్ర - నరసన్నపేట :** స్థానిక హడ్కో కాలనీలో సోమవారం వైసిపి మద్దతుదారులు, గూర్జ రమణ కుటుంబంతో పాటు మరో పది కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ సంధర్బంగా నియోజకవర్గ ఉమ్మడి కూటమి టిడిపి అభ్యర్థి, బగ్గు రమణమూర్తి రమణ కుటుంబీకులకు దేశం కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అన్నారు. అలాగే కాలనీలో పర్యటించి చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యేగా నన్ను, శ్రీకాకుళం ఎంపి అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్, బతకల సంతోషి, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, బెవర రాము, దంత త్రినాధరావు, అడపా చంద్రశేఖర్, కింజరాపు రామారావు, దంత శ్రీనివాసరావు, బలగ ప్రహర్ష, బోయిన ఆనందరావు, ముంగి విజయ్‌కుమార్, సరిపల్లి మధు, గొండు సింహాచలం, బోయిన సతీష్, గుడ్ల శ్రీరాములు, కింజరాపు చిన్నవాడు, ధనాల పుష్పలత, గుణుపురం రామలక్ష్మి, బలగ భారతి, పుచ్చల కల్పన పాల్గొన్నారు.

## పార్టీల మేనిఫెస్టోలను పరిశీలించి ఓటేయండి

**విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు :** ఎన్నికల సందర్బంగా పార్టీలు విడుదల చేసిన మేనిఫెస్టో లను ఒకసారి పరిశీలించి ఓటు వేయాలని టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి గౌతు శిరీష. ప్రజలను కోరారు.సోమవారం కొండవూరు వజ్రపుకొత్తూరు పంచాయతీలలో ఆమె ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కొల్లి రమేష్ సుమారు వంద మంది అనుచరులతో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ మేనిఫెస్టో కంటే వంద రెట్లు టిడిపి మేనిఫెస్టో మెరుగైనదని ఆమె అన్నారు. యాదవులుకు టిడిపి హయాంలో మేలు జరిగిందని అన్నారు.వైసీపీ పాలనలో అవినీతి, మాఫియా రాజ్యమేలిందని అన్నారు. సైకిల్ గుర్తు కి ఓటు వేసి ఎంఎల్ఏ గా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. వంశధార శివారు గ్రామాలకు నీరందించే బాధ్యత టిడిపి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ దుర్గారావు, కొండవూరు టిడిపి నాయకులు తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి కోనారి కిరణ్ కుమార్, లండ ధనరాజు, ఎంపీటీసీ చిట్టిబాబు, వజ్రపుకొత్తూరు టిడిపి నాయకులు శశి భూషణ్,అరసవల్లి ఉమామహేశ్వరరావు, నెయ్యల సూర్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు సురాడ మోహనరావు, మాజీ ఎంపీపీలు గోరకల వసంతరావు, మద్దిల చిన్నయ్య, క్లస్టర్ ఇంచార్జ్ లు కణితి సురేష్, పుచ్చ ఈశ్వర్ రావు, వజ్జ బాబూరావు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీతోనే రాష్ట్రం సస్యశ్యామలం : ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ

**విశాలాంధ్ర - కవిటి :** వైసీపీతోనే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలో గల బెలగాం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు కవిటి పంచాయతీలో గల కొత్తపాలెం గ్రామంలో విజయ కుమార్తె జాగృతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా విజయా ను ఎంపీగా పేరాడ తిలక్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, సీడప్ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి, కవిటి, బెలగాం గ్రామాల సర్పంచులు పూడి లక్ష్మణరావు, మద్దిలి ఈశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్, ఎఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, పూడి నీలాచలం, వైసీపీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ నుంచి తరలిస్తున్న రూ.29.50 లక్షలు నగదు పట్టివేత

**విశాలాంధ్ర - మెళియాపుట్టి :** విశాఖ నుంచి మెలియాపుట్టికి తరలిస్తున్న రూ 29.50 లక్షలను జిల్లా కేంద్రంలో సింహ ద్వారం జంక్షన్ వద్ద ఎన్నికల నిఘా బృందాలు గుర్తించి సీజ్ చేశాయి. అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈ బృందం ఇంత భారీ మొత్తంలో నగదును పట్టుకోవడంతో ఒక్క సారిగా కలకలం రేగింది. విశాఖకు చెందిన కదిలింది వెంకటేశ్వరరాజు (54) మెలియాపుట్టిలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలకు సంబంధించిన కాంట్రాక్టర్. ఈనెల 24న విశాఖ ఇండియన్ బ్యాంక్ లో డబ్బులు డ్రా చేశానని చెప్తున్నారు. ఆ డబ్బులను కూలీలకు చెల్లించేందుకు తీసుకు వెళుతున్నానని అధికారులకు చెప్పారు. అధికారులు తనిఖీల్లో బ్యాంకు నుంచి తగిన రసీదులను చూపించాల్సి ఉంది. వాటిని చూపించడంలో అతను విఫలం కావడంతో నగదును సీజ్ చేసి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారు. కూరగాయల బ్యాగులో కింద నగదు పెట్టి పైన పండ్లను ఉంచి నగదును రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. మెగా బృందంలో సభ్యుడైన తాసిల్దార్ సిహెచ్ రాధాకృష్ణ అనుమానంతో పండ్లను బ్యాగు నుంచి బయటికి తీయించి పరిశీలించగా నగదు నిల్వలు బయటపడ్డాయి. నగదుకు సంబంధించి పొంతనలేని సమాధానం చెబుతుండటంతో సీజర్ మేనేజ్మెంట్ కు ముఖ్య అధికారిగా వ్యవహరిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు సమాచారం చేరవేసి కేసు నమోదు చేసి నగదు సీజ్ చేశారు.

## ఎన్నికల వేళ మన మాజీ ఎమ్మెల్యే చుక్క పగడాలమ్మ

**విశాలాంధ్ర - కొత్తూరు :** పాతపట్నం మాజీ ఎమ్మెల్యే చుక్క పగడాలమ్మ కన్నవారు కొత్తూరు మండలం కలిగాం గ్రామం నిరాడంబరంగా ఆమె తన జీవితాన్ని గడుపుతున్నారు. 1972 లో పాతపట్నం నియోజిక వర్గాన్ని ఎస్.సి వర్గాలు వారికి కేటాయించారు పెళ్ళి అయి పాత పట్నం మండలం ముక్తాపురంలో అత్తవారింట ఉంటున్న పగడాలమ్మను నాటి కాంగ్రెస్ నాయకులు లుకలాపు లక్ష్మదాస్ ప్రోత్సాహంతో కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీలో నిలిచి ఆ నాటి ఎన్నికల్లో ఎంఎల్ ఏ గా గెలిచారు 1978 ఎన్నికల వరకు ఆమె అధికారంలో ఉన్నారు. తన పదవీ కాలంలో కూడా ఆమె నిరాడంబరంగా ఉన్నారు. ఇప్పుడు కూడా ఎంతో నిజాయితీ తో జీవితాన్ని గడుతున్నారు.

## పాతపట్నం అసెంబ్లీ బరిలో 10 మంది అభ్యర్థులు

**విశాలాంధ్ర - పాతపట్నం :** పాతపట్నం నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు నామినేషన్ లు దాఖాలు చేయగా వీరిలో ముగ్గురు నామినేషన్ లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురి కాగా 10 మంది అసెంబ్లీ అభ్యర్థులు పోటీలో నిలిచారని ఆర్ఓఎం అప్పారావు సోమవారం తెలిపారు. నామినేషన్ ల ఉప సంహరణ 29 వ తేది సోమవారం తో ముగియడంతో ఎన్నికలు మే నెల 13వ తేది కావడం తో 14 రోజులు గడువు మాత్రమే మిగిలి ఉండడం తో పోటీ లో ఉన్న అభ్యర్థులు ప్రచారం పై దృష్టి పెట్టారు. 10 అసెంబ్లీ అభ్యర్థులు 1 రెడ్డి శాంతి (వైసీపీ) 2 బొడ్డేపల్లి కృష్ణారావు (బి ఎస్పీ) 3 మామిడి గోవిందా రావు (టీడీపీ) 4 కొప్పు రోతూ వెంకట్ రావు (కాంగ్రెస్ 5) గోళ్ళ తిరుపతిరావు (జై భారత్ నేసనల్ పార్టీ) 6 జెన్ని సంజీవ్‌రావు (గొండ్వాన దండ కారణ్య పార్టీ) 7 అనపాన శంకర్ రావు (ఇండిపెండెంట్) 8 కొయ్యన గోవిందరావు (ఇండిపెండెంట్) 9 బగ్గు కృష్ణ (ఇండిపెండెంట్) 10 ఆర్ మోహన్ రావు (ఇండిపెండెంట్) వీరే బరిలో ఉన్నారు.

## అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

**విశాలాంధ్ర - ఇచ్ఛాపురం :** సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి సిద్ధ పడిన అభ్యర్థులకు సోమవారం ఎన్నికల సంఘం పరిధిలో పనిచేసే రిటర్నింగ్ అధికారి సుదర్శన దొర గుర్తుల కేటాయించు చర్యను చేపట్టారు. ప్రధాన రాజకీయ పక్షాలైన తెలుగుదేశం అభ్యర్థి బెందాళం అశోక్‌కు 'సైకిల్', వై.సి.పి అభ్యర్థిని పిరియా విజయకి 'ఫ్యాన్', బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బిసాయ్ వేదవరకు 'ఏనుగు', కాంగ్రెస్ అభ్యర్థికి 'హస్తం', రిజిష్టర్డ్ పార్టీలైన భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి బొడ్డ ముఖలింగంకు 'చెరకు రైతు', జైభీమ్‌రావ్ భారత పార్టీ అభ్యర్థి లోకనాథం లాభాలకు 'కోటు', స్వతంత్ర అభ్యర్థులు మురపాల లక్ష్మికి 'నాగరిక్', సుగ్గు చక్రవర్తికి 'రింగ్', సూర్యవరప్రసాద్‌కు 'కొబ్బరితోట'గుర్తులను కేటాయించారు. గుర్తుల కేటాయింపులో తొలత గందరగోళం నెలకొంది. ఒక స్వతంత్ర అభ్యర్థి పట్టు సడలించడంతో తెలుగుదేశం పార్టీకి ఊపిరి అందింది. ఎన్నికల ఫ్రీ సింబల్‌గా పేర్కొన్న గ్లాస్ గుర్తును సుగ్గు చక్రవర్తి మొదటి ప్రాధన్యత గుర్తుగా తెలిపినా, అభ్యంతరాలపై మల్లగుల్లాల అనంతరం అతనికి సర్దిచెప్పి రింగ్ గుర్తును కేటాయించారని సమాచారం.

## నూతన గ్రేడ్ టొయోటా రూమియన్‌ను పరిచయం చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటర్

**విశాలాంధ్ర - శ్రీకాకుళం :** టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టీకేఎం), ఈరోజు అధికారికంగా టొయోటా రూమియన్ యొక్క కొత్త గ్రేడ్ జీ - ఏ టీ ధరతో పాటు ఈ- సీ ఎన్ జీ బుకింగ్‌లను తిరిగి తెరిచినట్లు అధికారకంగా ప్రకటించింది. కొత్తగా విడుదల చేసిన జీ - ఏ టీ వేరియంట్ దాని సాటిలేని స్థలం, సౌకర్యం, అద్భుతమైన ఇంధన సామర్థ్యం, ఆకర్షణీయమైన మరియు ప్రీమియం బాహ్య డిజైన్‌తో రూమియాన్ యొక్క మార్కెట్ ఆమోదాన్ని మరింత పెంచుతుందని భావిస్తున్నారు. టికేయం యొక్క తాజా ఆఫరింగ్ ను అత్యంత ఆకర్షణీయమైన ఎక్స్-షోరూమ్ ధర రూ.13,00,000. డెలివరీలు మే 5 నుండి ప్రారంభమవుతాయని భావిస్తున్నారు. వినియోగదారులు రూ. 11,000/- బుకింగ్ రుసుముతో ఏదైనా అధీకృత డీలర్‌షిప్‌లలో లేదా ఆన్‌లైన్‌లో వాహనాన్ని బుక్ చేసుకోవచ్చు. టికేయం వైస్ ప్రెసిడెంట్ - సేల్స్ అండ్ స్ట్రాటజిక్ మార్కెటింగ్ , శబరి మనోహర్ మాట్లాడుతూ టొయోటా రూమియన్ లైనప్‌కి కొత్త గ్రేడ్‌ను జోడించడానికి మేము సంతోషిస్తున్నామన్నారు. జీఏటి వేరియంట్ బుకింగ్‌లు ఇప్పుడు తెరవబడ్డాయన్నారు. ఆగస్ట్ '23లో విడుదల చేసినప్పటి నుండి, టయోటా రూమియన్ కస్టమర్‌లలో ఉత్సాహాన్ని సృష్టించిందన్నారు. ఆరోగ్యకరమైన బుకింగ్‌లకు దారితీసింది అని అన్నారు.

## లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా ఎండుదొర

**విశాలాంధ్ర - పలాస :** అంతర్జాతీయ సేవా సంస్థ లైన్స్ క్లబ్ పలాస -కాశీబుగ్గ 2024 -2025 లయనిస్టిక్ సంవత్సరంకు గాను 52 వ అధ్యక్షునిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకులు లయన్ హనుమంతు ఎండు దొరను లయన్స్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్య దర్శిగా తమ్మినాన మాధవరావు, కోశాధికారిగా నెమలిపురి అప్పారావులను ఎన్నుకున్నారు అనంతరం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో లయన్స్ సభ్యులు రోణంకి హేమాచలం ,డోకి రామారావు ,తెప్పల కృష్ణ మూర్తి ,జవహర్ డా.కుమార్ నాయక్ ,జగదీశ్ ,పెద్ద రామన్న, వెంకటరావు, బాలకృష్ణ వర్మ పాల్గొన్నారు .

## నిరుపేదకు ఆర్థిక సాయం

**విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు :** నిరుపేద మహిళకు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ సభ్యులు తమవంతు ఆర్థిక సహాయం అందించారు.మండలం చిన్నమురహరిపురం గ్రామానికి చెందిన కీలు జయమ్మ ఆర్థిక పరిస్థితి సరిలేని కారణంగా ఆమె సంస్థ సభ్యలకు సహాయం కోరింది.వెంటనే స్పందించిన సభ్యులు సోమవారం రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులతో పాటు ఆరు వేల రూపాయల నగదును ఆమెకు అందించారు. ఉండడానికి సరైన వసతి లేకపోవడం చూసి చలించిన సభ్యులు ప్రభుత్వం నుంచి ఇల్లు మంజురయ్యేలా కృషి చేస్తామని ఆమెకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్దానమ హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకులు విజయ్, ఇంఛార్జి కొయ్యాల చంటి, కిరణ్, సైనీ శాంతి, కర్ణి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఎండలో కదం తొక్కిన పసుపు దండు...

**విశాలాంధ్ర - అరసవల్లి :** ఉదయం నుంచే భానుడి ప్రతాపం పెరిగిపోతున్నా.. దానికి మించిన పట్టుదలతో జనసేన, బీజేపీ శ్రేణులు కలసిరాగా పసుపు దండు నగరంలో కదం తొక్కింది. భానుడి భగభాగలను కూడా వెన్నెలలా భావించి కూటమి అభ్యర్థులు రామన్న, శంకరన్నల ద్వయం చేపట్టిన రోడ్ షోను విజయవంతం చేసారు. అధికార వైకాపా నేతలకు మండు వేసవిలో పట్టపగలు చుక్కలు చూపించారు. కూటమి ఎంపీ. ఎమ్మెల్యే అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గొండు శంకర్ సోమవారం చేపట్టిన రోడ్ షోకి అనూహ్యస్పందన లభించింది. టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఆధ్వర్యంలో నగర పరిధిలోని 3 డివిజన్లలో నిర్వహించిన రోడ్ షో పాత బస్టాండ్ వద్ద ప్రారంభమై 7రోడ్ల కూడలి, గుజరాతిపేట జంక్షన్ మీదుగా 44వ డివిజన్ రెల్లివీధికి చేరుకుంది. మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ పైడిశెట్టి జయంతితో కలసి రామ్మోహన్ నాయుడు, శంకర్ అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అనంతరం 9వ డివిజన్ పరిధిలోని ఇల్లిసిపురం భద్రమ్మ కోవెలవద్ద, 11 డివిజన్లోని గారవీధి జంక్షన్ వద్ద రోడ్ షోలో గొండు శంకర్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో అయిదేళ్లుగా సాగుతున్న అరాచక పాలనకు చరమగీతం పాడాలని, అదోగతి పాలైన రాష్ట్రాన్ని గాడిన పెట్టి ప్రజల భవిష్యత్తును కాపాడాలన్న లక్ష్యంతో పవన్ కళ్యాణ్ చొరవతో బీజేపీతో కలసి బాబు కూటమిని ఏర్పాటు చేసారన్నారు. వారి లక్ష్యాన్ని నెరవేర్చి బాబును ముఖ్యమంత్రిని చేసుకోవడం ద్వారానే మంచి రోజులు వస్తాయని, నగరం అభివృద్ధి చెందుతుందని ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడతాయన్నారు. యువకుడు, సేవా తత్పరుడు అయిన సామాన్య కుటుంబానికి చెందిన గొండు శంకర్ ను ఎమ్మెల్యే అభ్యర్థిగా కూటమి నేతలు నిలబెట్టారని అయనను ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎంపీగా తనకు హ్యాట్రిక్ విజయాన్ని చేకూర్చి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. గొండు శంకర్ మాట్లాడుతూ, సామాన్యుడినైన తన సేవలను గుర్తించి, చంద్రబాబు. లోకేష్ తనకు ఎమ్మెల్యే గా పోటీ చేసే అవకాశం కల్పించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ, వారి అభివృద్ధికి, నగర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అయిదేళ్ల అధికారంలో వున్న వైకాపా నేతలు అభివృద్ధిపై, ప్రజల సమస్యలపై దృష్టి సారించలేదని ఆరోపించారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోజనసేన నియోజకవర్గ కన్వీనర్ కోరాడ సర్వేశ్వరరావు, బీజేపీ నేతలు ఉమామహేశ్వరరావు, డివిజన్ ఇంచార్జిలు కవ్వాడి సుశీల, కవ్వడి రవి, మహేష్గం,దేపల్లి కోటేశ్వరరావు, బుర్రి మధు, నూకరాజు, వివిధ డివిజన్ల ఇంచార్జిలు, టీడీపీ. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రామన్న, శంకరన్న పాల్గొన్నారు.

## పనులు పూర్తి చేసిన బిల్లులు చేయరా...!

### - వివాదాలు సృష్టించిన దెవరు

### - బిల్లు చెల్లింపులో జాప్యం ఎందుకు

**విశాలాంధ్ర - ఆమదాలవలస :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ సచివాలయ వ్యవస్థను రూపొందించి అందుకు తగిన ఉద్యోగ నియామకాలతో పాటు భవనాల నిర్మాణాన్ని కూడా చేపట్టింది. ప్రతి పంచాయతీలో ప్రభుత్వ భవ నాల నిర్మాణంతో ఆరోగ్యకరమైన వాతా వరణాన్ని నెలకొల్పే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. అందుకు తగ్గట్టుగా నే ఒక్కో భవనం 40 లక్షల నుంచి 45 లక్షల వరకు నిర్మాణ వ్యయంతో పనులు చేపట్టారు. స్థానిక నాయకత్వం తో పాటు సచివాలయ వ్యవస్థ సిబ్బంది పనులు చేపట్టే సమయంలో నిర్వహణ , పరిశీల న చేశారు. ఈ పనుల నిర్వహణకు ఎన్ ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేశారు. పనుల పర్యవేక్షణ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపట్టింది. కొన్ని భవనాలకు పనులు చేపట్టే మేరకు బిల్లులు చెల్లించారు. ఎన్నికల నగారా మోగే సమయానికి జరిగిన పనుల మేర కు బిల్లులకు యం బుక్ రికార్డు చేశారు. కొన్ని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు బిల్లులను గుత్తేదారుకు అందించారు. కొన్నిచోట్ల వివాదాలు ఉన్నాయన్న నేపథ్యంలో బిల్లులు ఎగవేతకు చర్యలు తీసుకు న్నట్లు విమర్శలు ఉన్నాయి. నేతలు నిలుపుమన్నారని కొన్నిచోట్ల పనులు నాణ్యత లేదనేది కొన్నిచోట్ల, వివాదాలు పరిష్కారం కాలేదని మరికొన్నిచోట్ల బిల్లులు ఎగవేసేందుకు యంత్రాంగం సన్నద్ధమయింది. మండలంలోని ఎస్ ఆర్ సి పేటలో సచివాలయం, ఆర్ బి కేలు నిర్ణీత సమయంలోనే పనులు పూర్తి చేశారు. అలాగే సుమారు 6 లక్షల నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న రాజకీయ విభేదాలను దృష్టిలో ఉంచుకొని ఒక పంచాయతీరాజ్ అధికారి నిధులు చెల్లింపులో జాప్యం చేశారు. శాసన సభాపతి తమ్మినేని సీతారాం ప్రారంభో త్సవం చేసి సంబంధిత అధికారులకు భవనాలను అందించారు. ఇందుకు సంబంధించిన బిల్లులను తక్షణమే గుత్తేదారుకు అందిస్తామని ప్రారంభో త్సవ సమావేశంలో అధికారులు స్పష్టం చేశారు. నేటికి ఆరు నెలలు పూర్తవు తున్నప్పటికీ నేటికీ బిల్లులు చెల్లించక పోవడంతో గుత్తేదారి ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ప్రోటోకాల్ నిర్వహణ బాగాలేదని అందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు బిల్లులు నిలుపు చేసారు. ప్రారంభోత్సవ సమయంలో కానీ భవనాలలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమ యంలో కానీ లేని వివాదాలను అధికా రులు కొత్తగా లేవనెత్తి బిల్లులు చెల్లింపు లు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చిన ప్రోటో కాల్ తో శిలాఫలకాలు తిరిగి అమర్చి నప్పటికీ బిల్లులు మాత్రం చెల్లింపు కాలేదు. శిలాఫలకాలు అమరికలో అధికారులు సరైన చర్యలు తీసుకో కపోవడం వలన ఇటువంటి దుస్థితి ఏర్పడింది. సరి చేసిన తర్వాత కూడా బిల్లు చెల్లించకపోవడం గుత్తేదారు పైన అధికారులు వివక్ష చూపుతున్నారని విషయం తేట తెల్ల మవుతుంది. ఏది ఏమైనప్పటికీ పూర్తి చేసిన పనులలో నాణ్యతలో లేకుంటే తప్ప బిల్లులు చెల్లించవలసిన అవసరం అధికారులపై ఉంది. ఈ విషయమై పంచాయతీరాజ్ ఇంజనీర్ జ్యోతి ని వివరణ కోరగా ప్రోటో కాల్ అంశము సరిచేసిన తరువాత బిల్లు లు యం బుక్ రికార్డ్ చేశామని ఎఫ్ టి ఓ కూడా అయిపోయిందని త్వరలోనే సం బంధిత ఖాతాలో నిర్ణీత మొత్తం జమవు తుందని వివరించారు.

## అంత్యోదయ స్కూల్ కోసం స్థల పరిశీలన

**విశాలాంధ్ర - మందస :** మండలంలో డబారిసింగ్ గ్రామంలో పి.ఎం జన్‌మన్ మిషన్ అంత్యోదయ పథకం ద్వారా 65 మంది గిరిజన విద్యార్థులకు పాఠశాల వసతి గృహం ఏర్పాటు చేయుటకు సోమవారం సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి పి.జనార్ధనరావు స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట మండల సర్వేయరు మోహనరావు, గిరిజన సంక్షేమ శాఖ డి.ఈ వి.శ్రీనివాసరావు, ఎంఇవో-1 ఎం.లక్ష్మణ రావులు 30 ఎకరాల స్థలం పరిశీలించారు.

## పలాసలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు వీరే

**విశాలాంధ్ర - పలాస :** పలాస నియోజకవర్గంలో మే 13వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని పలాస ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో భరత్ నాయిక్ సోమవారం తెలిపారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి సీదిరి అప్పలరాజు, టీడీపీ నుంచి గౌతు శిరీషా, బహుజన్ సామాజిక పార్టీ నుంచి నగిరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి మజ్జి త్రినాద్‌బాబు, జయ్‌భరత్ పార్టీ నుంచి ఎం.ఎస్.అనిల్‌రాజు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి మోటూరు అప్పాలరాజు, సీపీఎం ఎం.ఎల్ లిబరేషన్ పోతనపల్లి కామేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులు తలగవలస జయరాం, దట్టి వీరాస్వామి, కర్ని వెంకటరమణమూర్తిలు ఉన్నారని తెలిపారు.

## కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి

**విశాలాంధ్ర - పలాస :** మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన మద్దిల జోగారావు (35) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. గత కొద్దిరోజులుగా డయాలసీస్ చేయించుకుంటూ చికిత్స పొందుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. జోగారావు ఆదాయంపై ఆధారపడి జీవిస్తున్న పరిస్థితుల్లో ఆయన మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది. ప్రభుత్వం పరంగా జోగారావు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## వైసీపీ ఓటమే లక్ష్యంగా పని చేయాలి

**విశాలాంధ్ర - సీలేరు :** వైసీపీ ఓటమే లక్ష్యంగా అందరూ పని చేయాలని బిజెపి జిల్లా కన్వీనర్ కూడా కృష్ణారావు పిలుపునిచ్చారు. సీలేరులో టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూడా కృష్ణారావు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో అరకు పార్లమెంట్ అభ్యర్థి కొత్తపల్లి గీత, పాడేరు అభ్యర్థి గిడ్డి ఈశ్వరిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. విభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బోగిరాజు, మండల ఉపాధ్యక్షులు కారే అప్పలరాజు, నాయకులు పాల్గన్నారు.

# ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడితే జీవో నెంబర్ 3 పునరుద్ధరణ

### అరకు పార్లమెంట్ అభ్యర్థి గీత, పాడేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఈశ్వరి

**విశాలాంధ్ర - చింతపల్లి :** నరేంద్ర మోడీ చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడితే జీవో నెంబర్ 3 పునరుద్దించి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని అరకు పార్లమెంటు బిజెపి అభ్యర్థి కొత్తపల్లి గీత, పాడేరు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి గిడ్డి ఈశరి లు అన్నారు. అంతర్ల గ్రామం నుంచి కూటమికి చెందిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోలాహలం నడుమ స్థానిక ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచందర్రావు ఆధ్వర్యంలో ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్స్ మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభను ఉద్దేశించి వారు మాట్లాడుతూ వైకాపా అధినేత, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హెూదాలో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి ఆడపిల్లలకు రక్షణ లేకుండా చేశారన్నారు. విద్యార్థులందరినీ చదివిస్తానని మాయమాటలు చెప్పి అమ్మ ఒడి పథకంలో కుటుంబంలో ఒక్క విద్యార్థికే అవకాశం కల్పించారని, ఉద్యోగస్తుల పిల్లలకు అమ్మ ఒడి వర్తింప చేయలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే మహిళలకు నెలకు 1500 చొప్పున ఏడాదికి 18000 నగదు ఇస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెదేపా ప్రభుత్వ హయాంలోనే జీవో నెంబర్ 3 తీసుకువచ్చి పటిష్టంగా అమలు చేసి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. గిరిజన నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక మైదాన ప్రాంతాలకు వలస బాటలు పట్టారని, మైదాన ప్రాంతాలలో పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్, ఇతర షాపులలో పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలలలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఆరోగ్యశాఖ సిబ్బంది పాఠశాలల్లో నియమించకపోవడంతో విద్యార్థులు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ మృత్యువాత పడిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి అన్నారు. వైకాపాకు ప్రజలు 151 సీట్లు ఇస్తే 60 నెలల్లో ప్రజలకు కష్టాలు ఇచ్చారని ఎద్దేవా చేశారు. వైకాపా ప్రభుత్వం కొత్త చట్టాలు తీసుకువచ్చి ప్రజలు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారిని ఇబ్బందులకు గురి చేస్తూ అనేక కేసులు బనాయిస్తున్న సందర్భాలు కళ్ళ ముందు కనిపిస్తున్నాయన్నారు.. ప్రజల ఆస్తులపై రక్షణ సన్నగిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 లక్షల కోట్లు విలువగల ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. అరకు పార్లమెంటు అభ్యర్థి కొత్తపల్లి గీత, పాడేరు నియోజకవర్గ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి ల మైన మమ్మల్ని మీ ఆడపడుచులుగా భావించి ఆశీర్వదించి చట్టసభలకు పంపిస్తే ప్రజల హక్కులను కాపాడుతామని ఈ సందర్భంగా వారు వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఎం వి వి ప్రసాద్, బొర్రా నాగరాజు, విజయ రాణి, ఆ పార్టీ పాడేరు నియోజకవర్గం పరిశీలకుడు నారాయణ, జనసేన నాయకుడు గంగులయ్య, బిజెపి నాయకుడు కూడా కృష్ణారావు, అధిక సంఖ్యలో తెదేపా జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.